

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

హౌసింగ్ పీడీ వేణుగోపాల్

ఏలూరు: నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా చేపట్టిన గృహనిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆ శాఖ జిల్లా అధికారులతో ఇళ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం డిసెంబర్‌లోనే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధపర్చేలా చూడాలని ఆదేశించిందన్నారు.జ ఈ మేరకు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణం వేగవంతంగా సాగేలా చూడాలన్నారు. ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులందరూ త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా వారిని చైతన్యపర్చాలన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించి పనులపై మండలాలవారీ సమీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కౌలుదారుపై కనికరం లేదాయే..!


బ్యాంకు రుణం నుంచి రైతుభరోసా వరకూ ఏ ఒక్కటీ అందని పరిస్థితి

రబీలోనైనా రుణాల మంజూరులో న్యాయం జరిగేనా

2019 పంట సాగుదారు హక్కుచట్టంతో అంతా అస్తవ్యస్థం

ఇ-క్రాప్‌లో పేరులేక ధాన్యం సైతం అమ్ముకోలేని దుస్థితి

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3 లక్షల మంది కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వాస్తవ సాగుదారుడైన కౌలురైతులను ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. '2019 పంట సాగుదారు హక్కుచట్టం' తెచ్చి కౌలురైతులకు ప్రభుత్వ సాయం ఏ ఒక్కటీ అందకుండా చేసింది. దీంతో కౌలురైతులు వ్యవసాయ సాగులో తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక కౌలురైతులు ఉన్నది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే. అధికారుల లెక్కల ప్రకారం మూడు లక్షల మందికిపైగా కౌలురైతులు జిల్లాలో ఉన్నారు. 2011 భూఅధీకృత సాగుదారుని హక్కు చట్టంతో కౌలురైతులకు కొన్ని హక్కులు కల్పించారు. భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డు జారీచేసి బ్యాంకు రుణాల నుంచి ప్రభుత్వం అందించే ప్రతి సాయం కౌలురైతులకు అందేలా చట్టంలో పేర్కొన్నారు. దీంతో అధికారులు కౌలుకార్డులు ఇవ్వకపోతే రైతుసంఘాల ఆధ్వర్యంలో రైతులు రోడ్డెక్కి ఆందోళనలు నిర్వహించి సాధించుకునేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2011 కౌలుచట్టంలో ఏకపక్షంగా మార్పులు చేసేసింది. దాని స్థానంలో 2019 పంట సాగుదారు హక్కుచట్టం తెచ్చింది. ఈ చట్టంలో భూయజమాని అంగీకారం లేకుండా కౌలు రైతులకు సిసిఆర్‌సి(కౌలుకార్డు) ఇవ్వకూడదని తెలిపింది. సిసిఆర్‌సి కార్డు లేకుంటే బ్యాంకు రుణం నుంచి బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతుభరోసాతోపాటు చివరికి ధాన్యం అమ్ముకునే పరిస్థితి కూడా కౌలురైతులకు లేకుండాపోయింది. కౌలుకార్డులు కూడా అరకొరగా మంజూరు చేస్తున్నారు. కార్డులు ఇచ్చినవారికి కూడా బ్యాంకు రుణాలుగాని ప్రభుత్వ సాయం పూర్తిస్థాయిలో అందని పరిస్థితి నెలకొంది.

కౌలురైతుల గురించి పట్టించుకునేవారేరీ

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 70శాతానికిపైగా వ్యవసాయ సాగు కౌలురైతులే చేస్తున్నారు. తమ భూములు కౌలుకిచ్చేసి భూయజమానులంతా వ్యాపారాలు చేసుకుంటున్నారు. వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు అందించాల్సిన సాయం మాత్రం సాగుచేయని భూయజమానులకే ప్రభుత్వం అందిస్తోంది. నిబంధనల ప్రకారం పంటరుణం సాగుచేసే రైతుకు అందించాలి. భూయజమానికి పంటేతర రుణం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే బ్యాంకులు కౌలు రైతులకు పంటరుణాలు ఇవ్వడం లేదు. రైతుమిత్ర గ్రూపులకు అరకొరగా రుణాలిచ్చి అవే కౌలురైతులకిచ్చిన రుణాలుగా కాగితాల్లో చూపిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో జిల్లాలో కౌలురైతులకిచ్చిన రుణాలపై ఏఒక్క అధికారీ నోరు మెదపని పరిస్థితి ఉంది. ముఖ్యంగా వ్యవసాయ శాఖాధికారులు కౌలురైతుల గురించి పట్టించుకోని పరిస్థితి జిల్లాలో కనిపిస్తోంది. ప్రస్తుతం పండించిన ధాన్యం సైతం భూయజమాని పేరుపైనే కౌలురైతులు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. భూయజమాని అంగీకరించలేదని సిసిఆర్‌సి కార్డులు ఇవ్వకుండా భూయజమానికి ఉన్న సాగుభూమి అంతా వారిపేరుపైనే ఇ-క్రాప్ చేశారు. ఇప్పుడు 12.50 ఎకరాలు వరకూ మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామని నిబంధన పెట్టారు. మరి ఆ భూయజమాని పొలం సాగు చేసిన కౌలురైతులు ధాన్యం ఏవిధంగా అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. సాగుచేసే రైతుకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందిస్తున్న రైతుభరోసా కూడా కౌలురైతులకు అందడం లేదు. ఏదో ఒకరిద్దరికి ఇచ్చి కౌలురైతులకు ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నారు. రబీలోనైనా కౌలురైతులకు పూర్తిస్థాయిలో బ్యాంకు రుణాలు అందించడంతోపాటు భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా సిసిఆర్‌సి కార్డులు ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది.



రామం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎ.రవి

ఆదర్శనీయులు ఉద్దరాజు రామం

28వ వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

కమ్యూనిస్టు నేత, మాజీ ఎంపీ ఉద్దరాజు రామం ఆదర్శనీయులని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో రామం 28వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. తొలుత రామం చిత్రపటానికి రవి, ఇతర నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రామం నిరాడంబర జీవి అని, త్యాగశీలి అని కొనియాడారు. పెద్ద పెద్ద చదువులు చదవకపోయినా పట్టుదలతో హిందీ నేర్చుకుని పార్లమెంటులో రాష్ట్ర సమస్యలపై అనర్గళంగా మాట్లాడారన్నారు. మార్క్సిజం ప్రజలందరికీ అర్థం కావడానికి భగత్‌సింగ్ శిష్యుడైన శివవర్మ రచించిన మార్క్సిజం ఓనమాలు అనే పుస్తకాన్ని సులభశైలిలో తెలుగులోకి అనువదించారని తెలిపారు. రామం సతీమణి మాణిక్యాంబ కూడా స్వాతంత్ర్య సమరయోధురాలిగా, మహిళా నాయకురాలిగా పని చేశారని తెలిపారు. వారి జీవితాన్ని నేటి ప్రజలు, యువకులు, మహిళలు అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రామం వర్ధంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర 29వ మహాసభ సందర్భంగా ఈ నెల 28వ తేదీ సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు జంగారెడ్డిగూడెంలోని ఎంబి సోషల్ క్లబ్‌లో 'వ్యవసాయ రంగ సంక్షోభం-పరిష్కార మార్గాలు' అనే అంశంపై సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పి.మంగరాజు, సంఘాల నాయకులు. శ్యామలారాణి, కె.విజయలక్ష్మి, రామాంజనేయులు, కోటేశ్వరరావు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఏలూరు



కెవివి.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు



పి.సుబ్బారావు, జిల్లా ప్రధానకార్యదర్శి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ (సిఐటియు) మహాసభలో ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు డిఎన్‌విడి ప్రసాద్ తెలిపారు. జిల్లాల విభజన నేపథ్యంలో మూడు జిల్లా కమిటీలుగా విభజన చేశామన్నారు. ఏలూరు జిల్లా కమిటీ గౌరవాధ్యక్షులుగా డిఎన్‌డివి.ప్రసాద్, అధ్యక్షులుగా కెవివి.సత్యనారాయణ, ప్రధానకార్యదర్శిగా పి.సుబ్బారావు, కోశాధికారిగా జి.వీరయ్య, ఉపాధ్యక్షులుగా బిఎన్‌వి.భీమేశ్వరరావు, సర్వేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా వి.చెన్నారావు ఎన్నికయ్యారన్నారు. కమిటీ ఎన్నికల నిర్వహణ సిఐటియు నాయకులు కె.రాజారామ్మోహన్‌రాయ్ పర్యవేక్షణలో జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.అజయ్ కుమార్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సహకార సంఘాల ఉద్యోగులంతా ఐక్యంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

న్యాయవాద వృత్తికి నిబద్ధత అవసరం

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వెంకట శేషసాయి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

న్యాయవాద వృత్తికి నిబద్ధత ఎంతో అవసరమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎ.వెంకట శేషసాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్, ఏలూరు బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని బివి.రంగారెడ్డి ప్రాంగణంలో ఆదివారం న్యాయవాదులు, న్యాయవిద్యార్థులు, బార్ కౌన్సిల్ సభ్యులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ. వెంకట శేషసాయి, హైకోర్టు న్యాయమూర్తి, పశ్చిమగోదావరి పోర్టుపోలియో జడ్జి జస్టిస్ సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సదస్సుకు రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షుడు గంటా రామారావు అధ్యక్షత వహించగా జిల్లా జడ్జి జస్టిస్ సి.పురుషోత్తమకుమార్, కేంద్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎ.రామిరెడ్డి, ఎపి బార్ కౌన్సిల్ సభ్యుడు బివి.కృష్ణారెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.శశిధర్‌రెడ్డి, పలువురు న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.వెంకట శేషసాయి మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఉన్నవారు నిబద్ధత, నైతికవిలువలు కలిగి ఉండాలన్నారు. నిరంతర అధ్యయనంతోనే ఆ రంగంలో ఉత్తమంగా నిలిచేందుకు అవకాశం ఉందన్నారు. వివిధ కేసుల్లో న్యాయమూర్తుల తీర్పులను బాగా చదవాలన్నారు. ప్రాథమిక హక్కులు, చట్టాన్ని అన్వయించే పద్ధతి, కేసుల విస్తృతి, సీనియర్లు వాదించే పద్ధతిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పౌర శిక్షాస్మృతి పరిధిలోని మధ్యంతర పిటీషన్లు, సమగ్ర విచారణ, కేసు తీరుతెన్నులు క్షుణంగా తెలుసుకోవాలని ఆయా అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా యువ న్యాయవాదులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఇటువంటి సెమినార్లు జూనియర్ న్యాయవాదులకు, ప్రాక్టీస్‌లో ఉన్న న్యాయవాదులకు, న్యాయ పరీక్షలు రాసేవారికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జిల్లా పోర్టుపోలియో జడ్జి జస్టిస్ సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్ ఈ సందర్భంగా నేర శిక్షాస్మృతి పునశ్చరణ అంశాన్ని విపులీకరించారు. నేర సంబంధిత కేసుల్లో సమగ్ర పరిశీలన ఎంతో అవసరమన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి లీగల్ అవేర్నెస్, స్టాండర్స్ తదితర వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ఎ.వెంకట శేషసాయి, సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్, నైనాల జయసూర్య, సుబ్బారెడ్డి సత్తిలను శాలువాలతో సత్కరించారు. తొలుత హైకోర్టు న్యాయమూర్తి, సిహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎ.వెంకట శేషసాయి

30న జిల్లా సమీక్షా కమిటీ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా సమీక్షా కమిటీ సమావేశం ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖా మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షతన జరిగే సమావేశంలో నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు, నాడు-నేడు పనులు, ధాన్యం కొనుగోలు, వ్యవసాయ అనుబంధ రంగాలు, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్యం, గడపగడపకు మన ప్రభుత్వం తదితర అంశాలపై సమీక్షిస్తారని పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో 30వ తేదీ ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి సంబంధిత అధికారులందరూ పూర్తి సమాచారంతో తప్పక హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

గ్రామీణ వైద్యులకు శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు

మెదడు, వెన్నుపూస, నరాలకు సంబంధించిన వ్యాధులకు చేయాల్సిన ప్రథమ చికిత్సను విజయవాడ కామినేని హాస్పిటల్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.కిరణ్‌కుమార్ ఆన్‌లైన్ ద్వారా గ్రామీణ వైద్యులకు వివరించారు. పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీ రాయల్ గ్రాండ్‌లో ది గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడ కామినేని హాస్పిటల్స్ సౌజన్యంతో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు మండలాల గ్రామీణ వైద్యులకు ఆదివారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కామినేని హాస్పిటల్స్ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ వి.నవీన్‌కుమార్ మాట్లాడుతూ మెదడు, వెన్నుపూస, నరాలకు సంబంధించిన వ్యాధులకుగాను తక్షణమే గ్రామీణ వైద్యులు చేయాల్సిన ప్రథమ చికిత్సను వివరించారు. గ్రామీణ వైద్యుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎన్.రాజు, రాష్ట్ర కోశాధికారి పి.నాగేందర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సురేష్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.కొండారెడ్డి, కృష్ణాజిల్లా అధ్యక్షులు కపర్తపు కష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఉస్మాన్, జిల్లా కోశాధికారి సిహెచ్.సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి డివి.నాగేశ్వరరావు, అధ్యక్షులు టి.తాతారెడ్డి, ఉపాధ్యక్షులు బి.దుర్గాప్రసాద్, ఎస్‌వి.రాజాప్రసాద్, చెన్నారావు, వసుంధర దేవి, నరసింహారావు, ఎం.శివరాం, రవిశంకర్, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

ముగిసిన జెఎన్‌టియు కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జెఎన్‌టియు కాకినాడ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల కబడ్డీ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో ఆదివారం ముగిశాయి. ఏలూరులోని సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులు పాటు జరిగిన ఈ పోటీల్లో క్రీడాకారులు నువ్వా.. నేనా.. అన్న రీతిలో పోటీ పడ్డారు. శనివారం బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించగా 65 కళాశాలల్లో నుంచి 210 మంది పాల్గొన్నారు. ఆదివారం సీనియర్ మహిళల కబడ్డీ పోటీల్లో 20 కళాశాలలకు చెందిన క్రీడాకారులు తలపడ్డారు. ఈ పోటీల్లో ఎంపిక చేసిన క్రీడాకారులను జెఎన్‌టియు కాకినాడ విశ్వవిద్యాలయం జట్టు తరపున వచ్చేనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ చెన్నైలోని అమిటీ యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారతస్థాయి విశ్వవిద్యాలయ క్రీడా పోటీల్లో పాల్గొంటారని విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి జి.శ్యామ్ తెలిపారు. ఈ పోటీల్లో శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకూ ఎనిమిది జిల్లాల్లో ఉన్న తమ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి సిఆర్.రెడ్డి కళాశాల యాజమాన్యం ఉచితంగా ఆతిథ్యాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో సిఆర్.రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.సంజీవరావు, నసీమా సుల్తాన్, హేలాపురి ఇంజినీరింగ్ కళాశాల ఎఒ టిఎస్ కరుణానిధి పాల్గొన్నారు.

ముగిసిన ట్రిపుల్ ఐటి కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నూజివీడు

ట్రిపుల్ ఐటి (ఆర్‌జియుకెటి పరిధిలోని) నూజివీడు క్యాంపస్‌లో 2022-23 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ఆదివారం ముగిశాయి. చివరి కౌన్సెలింగ్‌లో 141 సీట్లు నాలుగు క్యాంపస్లకు సంబంధించి భర్తీ అయినట్లు కౌన్సెలింగ్ కన్వీనర్ ఆచార్య గోపాలరాజు తెలియజేశారు. కౌన్సిలింగ్ ప్రక్రియను విసి కెసి.రెడ్డి పర్యవేక్షించారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

వ్యకాస రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వచ్చేనెల 8, 9, 10 తేదీల్లో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభ పోస్టర్లను ఆదివారం సరిపల్లిలో పంపిణీ చేశారు. ఉపాధి కూలీలకు కరపత్రాలు అందించారు. ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు, రైతులు, చేతివృత్తిదారులు, చిరువ్యాపారులు, చిరుఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని రాంబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్య.కా.స మండల కార్యదర్శి పూనెం అమ్ములు, కూలీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బిసి వ్యతిరేకి పార్టీ

బిసి చైతన్య సామాజిక సభలో ఒబిసి మోర్చ జాతీయ అధ్యక్షులు లక్ష్మణరావు

ఏలూరు అర్బన్: బిసి, ఎస్‌సి, మైనార్టీలను రాష్ట్రపతులను, ఉపరాష్ట్రపతులను చేసిన ఘనత బిజెపికి దక్కుతుందని ఆ పార్టీ ఒబిసి మోర్చ జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు కొండ లక్ష్మణరావు అన్నారు. ఏలూరు నగరంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన బిసి సామాజిక చైతన్య సభలో ఆయన మాట్లాడారు. బిసిలకు రాజీవ్‌గాంధీ వ్యతిరేకమని, ఇందిరాగాంధీ, నెహ్రూ కూడా బిసిలకు సహకారం అందించిన దాఖలాలు లేవని ఆయన విమర్శించారు. రిజర్వేషన్ ఫలాలు దక్కని జాతులకు త్వరలో రోహిణి కమిషన్ ద్వారా మేలు జరుగుతుందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలు బిసిలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు మాట్లాడుతూ ఆంధ్రాలో వివిధ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఎలాంటి నిధులనూ మంజూరు చేయకుండా కేవలం నామమాత్రపు ఛైర్మన్‌లను నియమించిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఒబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ సభకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో తపన చౌదరి, శరణాల మాలతీరాణి, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన ఖరారు

మూడురోజుల పాటు ఉమ్మడి జిల్లాలో పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ఈ నెల 30 నుంచి డిసెంబర్ రెండో తేదీ వరకూ మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్‌ను ఆదివారం టిడిపి నేతలు విడుదల చేశారు. 30వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు కలపర్రు టోల్‌గేట్ వద్ద నుంచి బైక్‌ర్యాలీగా బయలుదేరతారు. 11.30 గంటలకు పెదవేగి మండలం విజయరాయిలో బహిరంగ సభ జరగనుంది. మూడు గంటలకు వలసపల్లి క్రాస్‌రోడ్, ధర్మాజీగూడెం, మట్టమ్మగూడెం, లింగపాలెంలో మాట్లాడనున్నారు. ఆరు గంటలకు చింతలపూడిలో రోడ్‌షో సాగనుంది. ఏడు గంటలకు బోసుబొమ్మ సెంటర్‌లో బహిరంగ సభ జరగనుంది. రాత్రికి నరసన్నపాలెంలోని దండమూడి రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో బస చేయనున్నారు. డిసెంబర్ ఒకటో తేదీ 10.30 గంటల వరకూ బిసిలతో సమావేశం కానున్నారు. మూడు గంటలకు పోలవరంలో బహిరంగ సభ జరగనుంది. అనంతరం కొవ్వూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. రాత్రి ఎనిమిది గంటలకు మెరకవీధి విజయవిహార్ సెంటర్‌లో బహిరంగ సభలో ప్రసంగించి రాత్రికి సుందరసాయి నిగమమ్ ఫంక్షన్‌హాల్‌లో బస చేయనున్నారు. రెండో తేదీన మూడు గంటలకు నిడదవోలు గణేష్‌చౌక్‌లో బహిరంగ సభ జరగనుంది. అనంతరం పర్యటన కొనసాగనుంది. మధ్యలో వరిరైతులతో సమావేశం కానున్నారు. అనంతరం రాత్రి 7.30 గంటలకు తాడేపల్లిగూడెం శేషమహల్ సెంటర్‌లో బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. అనంతరం విజయవాడ బయల్దేరి వెళ్లనున్నారు.

కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా సురేష్, ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



సురేష్



ఫ్రాన్సిస్

కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మంగం సురేష్, అందుగుల ఫ్రాన్సిస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కెవిపిఎస్ జిల్లా మహాసభ స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కాలేజ్ ఆవరణలో రెండు రోజులుగా జరిగాయి. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

52,196 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

7755 మంది రైతుల నుంచి రూ.106.52 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు

1,116 మంది రైతుల ఖాతాల్లో రూ.13.22 కోట్లు జమ

జెసి పి. అరుణ్ బాబు

ప్రజాశక్తి - ఏలూరు

ఖరీఫ్ పంట కాలం 2022-23కు ఇప్పటివరకు 176 రైతు భరోసా కేంద్రాల ద్వారా 7,755 మంది రైతుల నుంచి 52,196 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. ఇప్పటి వరకూ 7,755 మంది రైతుల నుంచి రూ.106.52 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. అందులో 1,116 మంది రైతులకు రూ.13.22 కోట్ల నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతుందన్నారు. ఉంగుటూరు మండలంలో అత్యధికంగా 3,006 మంది రైతుల నుంచి రూ.45.03 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. అందులో 360 మంది రైతులకు రూ.4.88 కోట్లు ఇప్పటికే చెల్లించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు సక్రమంగా సాగేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు, ఆర్‌బికె సిబ్బంది సమిష్టిగా కృషిచేస్తున్నారన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు కేతవరం విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు మండలంలోని కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పొదిల తులసీ రామ్, వెలగల నాగదుర్గ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాదిరాజు రామరాజు తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన అత్తిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-17 విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి చదరంగం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఉత్తమ విద్యార్థులతో పాటు విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ జి.రమేష్‌ను అభినందించారు. విద్యార్థులను అభినందించిన వారిలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ బర్రే రమేష్, ఉపాధ్యాయులు టి.కుమారి, నాగలక్ష్మి, ఏసురత్నం, పాషా, ఫణిశ్రీ, జార్జ్ పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ సంక్షోభంపై నేడు సదస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఈనెల 28న జరిగే వ్యవసాయ రంగ సంక్షోభంపై నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జోడే సూర్యచంద్రం అధ్యక్షత వహించారు. సంఘం నాయకులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29వ మహాసభ వచ్చేనెల 8, 9, 10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో జరుగుతుందని, ఈ నేపథ్యంలో రైతుల, వ్యవసాయ కార్మికుల సమస్యలపై సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సు స్వాతంత్ర్య సమరయోధులు రైతాంగ పీడిత ప్రజాఉద్యమ నేత అమరజీవి ఉద్దరాజు రామం 28వ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశంలో వ్యవసాయరంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందన్నారు.రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రాయితీపై విత్తనాలు, పురుగుమందులు ఇచ్చి సహకారం అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల స్థితిగతులు రోజురోజుకు దిగజారుతున్నాయన్నారు. ఇప్పటికే కూలీలు గ్రామాల్లో పనుల్లేక వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. కూలీలను ఆదుకోవాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ ప్రయివేటీకరణ పేరుతో వ్యవసాయరంగాన్ని కారుచౌకగా అమ్మేయడానికి కంకణం కట్టుకున్నాయని మండిపడ్డారు. వ్యవసాయ రంగంపై చర్చించడం కోసం ఈ నెల 28 వ తేదీన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదసకు ముఖ్యఅతిథులుగా ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడతారని తెలిపారు. దేశానికి అన్నం పెట్టే రైతు కార్మికుల సంక్షేమం కోసం జరిగే సదస్సులో రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.సూర్య కిరణ్, ఎ.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

మహిళలకు రాందేవ్ క్షమాపణ చెప్పాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఏలూరు

మహిళల వస్త్రధారణపై అసభ్యకరంగా మాట్లాడిన బాబా రాందేవ్‌బాబా వ్యాఖ్యలను యుటిఎఫ్ ఏలూరు జిల్లా మహిళా విభాగం ఖండించింది. ఈ సందర్భంగా మహిళా విభాగం జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బి.సుభాషిణి, జిల్లా కార్యదర్శి ఎస్.సుధారాణి, బి.అనురాధ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వి.కనకదుర్గ మాట్లాడుతూ ఇహ విషయాలకు ప్రాధాన్యత లేదని అంతా మిథ్య అని ప్రచారం చేసుకుంటూ బాబాగా పిలవబడే రాందేవ్ నీచంగా మహిళల పట్ల వ్యాఖ్యానించడం క్షమించరాని విషయమన్నారు. అత్యంత గౌరవంగా చూడాల్సిన మహిళలను చులకనగా మాట్లాడటం సరికాదని తెలిపారు. మహిళలను కించపరుస్తూ తప్పుడు ఆలోచనా ధోరణితో మాట్లాడిన రాందేవ్ బాబా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. సన్యాసి అని చెప్పుకునే రాందేవ్ వ్యాఖ్యలను పౌర సమాజం ఖండించాలని, క్షమాపణ చెప్పే వరకు రాందేవ్ బాబా ఉత్పత్తులను బహిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కూడా ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాందేవ్‌బాబా వ్యాఖ్యల పట్ల అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు తెలిపారు.



సిబిఎస సత్కరిస్తున్న దాతలు, ప్రధానోపాధ్యాయులు

చదువులో రాణిస్తేనే భవిష్యత్

సిఐ బాలసురేష్‌బాబు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, చక్కని భవిష్యత్తుకు మార్గం ఏర్పాటు చేసుకోవాలని స్థానిక సిఐ బాలసురేష్ బాబు సూచించారు. స్థానిక ఒకటో వార్డు గరుడ పక్షి నగర్ ఎంపిపి పాఠశాలలో దాతలు గుండమోగిని నరసింహారావు భార్య సత్యవతి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది ఉన్నత ఉద్యోగాలు సాధించారన్నారు. చదువుకు చిహ్నమైన సరస్వతి దేవి విగ్రహావిష్కరణ హర్షణీయమన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మార్గరెట్, సిబ్బంది సిఐని శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ నగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.


పట్టాలు అందిస్తున్న ఎంఎల్ఎ

పోలవరం నిర్వాసితులకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఆదివారం చల్లవారిగూడెంలో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలిజా ద్వారా ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వలన 41.15వ కాంటూర్‌లోని మొదటి విడత ముంపునకు గురవుతున్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని నిర్వాసితులు తమకు ఇళ్ల వద్దన స్థలాలు కావాలని దరఖాస్తులు పెట్టుకున్న కుక్కునూరు మండలంలో 53, ఎ బ్లాక్‌కు చెందిన 49మంది, కివ్వాక్4, వేలేరుపాడులో167, శ్రీరాంపురం120, కొయిదా47 మొత్తం220 కుటుంబాలకు జంగారెడ్డిగూడెం పరిధిలోని చల్లవారిగూడెంలో ఒక్కొక్కరికి ఐదు సెంట్ల ఇంటి స్థలం పట్టా పుస్తకాలను అందించినట్లు తెలిపారు. ఇళ్ల కాలనులన్ను వారికి ఇంటి నిర్మాణం శరవేగంగా జరుపుతున్నట్లు తెలిపారు. నిర్వాసితులందరికీ త్వరలోనే పునరావాస పరిహారం ప్యాకేజీ కాలనీలకు తరలిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుక్కునూరు సర్పంచ్ రావు మీనా వినోద్, గ్రామస్తులు ఎం. వెంకట్రాజు, కె.శ్యామ్‌రాజు, సుర్ల అనిల్, రాము, చంటి పాల్గొన్నారు.

రోటరీ కమ్యూనిటీ హాలుకు ఏసీ వితరణ

జంగారెడ్డిగూడెం:రోటరీ జిల్లా 3020 గవర్నర్ 2023-24 ఏడాదికి ఎన్నికైన రావూరి వెంకట సుబ్బారావు(దత్త) స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్ వేదికకు ఏసీ సౌకర్యం కల్పించారని రోటరీ అధ్యక్షులు దారావు కృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక మల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాల్లో రోటరీ కార్యదర్శి ఉదా రామ్‌గోపాల్(గోపి) నిర్వహణలో సుమారు రూ.80 వేల విలువగల ఏసీని అమర్చారు. ఈ సందర్భంగా దారావు కృష్ణ మాట్లాడుతూ ఏసీని అందించిన వెంకట సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే డిసెంబర్ 16వ తేదీ రోటరీ జిల్లా గవర్నర్ విశ్వనాథ భాస్కరరావు జంగారెడ్డిగూడెం క్లబ్ పరిధిలో పర్యటించనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మల్లాది సీతా రామారావు, చావల్లి శ్రీరాములు, బండారు సత్యనారాయణ, గణిశ ఆనంద ప్రసాద్, వెలివెల పెద్దిరాజు, ధనకుమార్, కొమ్మకూరి నాగేశ్వరరావు, రాంగల దేవీప్రసాద్, ప్రవీణ్, బలిరెడ్డి తిలక్, నరం రేణుక పాల్గొన్నారు.

హోటళ్లలో భోజనం నాణ్యంగా ఉండాలి

చింతలపూడి:హోటళ్లలో భోజనం నాణ్యంగా ఉండాలని, కల్తీ ఆహార పదార్థాలు విక్రయించొద్దని చింతలపూడి నగరపంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు అన్నారు. చింతలపూడి పట్టణంలో ఏపి హోటల్ అసోసియేషన్ అనుబంధంగా చింతలపూడి నగర పంచాయతీ హోటల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. హోటల్ అసోసియేషన్ వనసమారాధన చింతలపూడి శివారు తోటలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర పంచాయతీ కమిషనర్ హాజరయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా తిరుమల హోటల్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎమ్‌డి జలీల్, కార్యదర్శిగా తోట శ్రీనివాసరావు, ట్రెజరర్ రమేష్, జాయింట్ సెక్రటరీగా రాయుడు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సత్యనారాయణ, తోట్టు బంధ్య తదుపరు ఉపాధ్యక్షులుగా యాకూబ్‌ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ హోటల్ యాజమాన్య సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామన్నారు. ప్రజా ఆరోగ్యం దృష్ట్యా నాణ్యమైన ఆహారం అందించే చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో హోటల్ యజమానులు, బేకరీ యజమానులు సంతోష్, వంశీ, సీతారాం, నాగరాజు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అదృశ్యమైన ఇద్దరు బాలికల ఆచూకీ లభ్యం

టి.నరసాపురం:అదృశ్యమైన కొన్ని గంటల వ్యవధిలోనే ఇద్దరు బాలికల ఆచూకీని రేణిగుంటలో పోలీసులు ఆదివారం గుర్తించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొర్రంపాలెంకి చెందిన ఇద్దరు బాలికలు శనివారం సాయంత్రం ప్రయివేటుకు వెళ్లి వస్తామని చెప్పి ఇంటినుండి బయలుదేరారు. రాత్రయినా వారు ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లవద్ద వెతికారు. వారి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ కె.సతీష్‌కుమార్ విచారణ చేపట్టారు. జిల్లా ఎస్‌పి, పోలవరం డిఎస్‌పి ఆదేశాల మేరకు బాలికల సెల్ ఫోన్ ట్రాకింగ్ చేయగా నెల్లూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట హైవేలో వెళ్తున్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రేణిగుంట డిఎస్‌పి పర్యవేక్షణలో బాలికలను గుర్తించి వారి సమాచారాన్ని టి.నరసాపురం పోలీసులకు అందించారు. బాలికలను తీసుకురావడానికి స్థానిక పోలీస్ స్టేషన్ టీం వెళ్లినట్లు సమాచారం. గంటల వ్యవధిలోనే వారి ఆచూకీ కనుగొన్న పోలీసులను తల్లిదండ్రులు అభినందనలు తెలుపుతున్నారు.

8 మంది పందెంరాయుళ్ల అరెస్టు

ఆగిరిపల్లి:పరిధిలోని చొప్పరమెట్ల, నరసింగపాలెంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్ఐ ఎన్.చంటిబాబు తన సిబ్బందితో దాడి చేసి ఎనిమిది మంది పందెంరాయుళ్లను, వారి నుంచి రూ.2,220 నగదు, రెండు కోడి పుంజులను, ఐదు కోడి కత్తులను స్వాధీనపర్చుకుని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఆగిరిపల్లి:రౌడీషీటర్లు గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కల్గించిన, అల్లర్లకు పాల్పడినా కఠినచర్యలు తప్పవని ఎస్ఐ ఎన్.చంటిబాబు హెచ్చరించారు. ఆదివారం ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్లో మండల పరిధిలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పదేళ్లుగా ఎలాంటి కేసులు లేకుండా, మంచి ప్రవర్తన కలిగి ఉన్న, వయస్సు పైబడిన, దీర్ఘకాల అనారోగ్యంతో బాధపడుతున్నవారిపై రౌడీషీట్ తొలగింపునకు సంబంధించి ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రౌడీషీటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శాఖా గ్రంథాలయంలో ప్రతీ ఆదివారం నిర్వహించే 'చదవడం మాకు ఇష్టం' కార్యక్రమంలో పాల్గొని తమకు ఆసక్తిగల పుస్తకాలను చదివి వాటిపై నిర్వహించే సమీక్షలో పాల్గొనే విద్యార్థులకు తగురీతిలో ప్రోత్సాహకాలు అందజేస్తానని భీమడోలు సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ బాలనాగు విజయసారథి తెలిపారు. గ్రంథపాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సుమారు 50 మంది విద్యార్థులు తమకు ఆసక్తిగల పుస్తకాలను చదివారు. వాటిపై సమీక్షను గ్రంథపాలకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పుస్తకాలు చదవడం ద్వారా గ్రహించాల్సిన, నేర్చుకోవాల్సిన అంశాలను వివరించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సత్యం ఫౌండేషన్ ఛైర్మన్ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు డిసెంబర్, జనవరి నెలలలో ప్రతీ ఆదివారం శాఖా గ్రంథాలయానికి హాజరై పుస్తకాలు చదివి, నిర్వహించే పుస్తక సమీక్షలలో పాల్గొనే విద్యార్థులకు వారికి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేసి ఉచితంగా అందజేస్తానని హామీ ఇచ్చారు.

పిఎంపిల సేలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - గణపవరం

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రథమ చికిత్స అందించేది పిఎంపి వైద్యులేనని, ఆరి సేవలు ప్రశంసనీయమని భీమవరం ఇంపీరియల్ ఆసుపత్రి వైద్యులు లక్ష్మణరావు అన్నారు. ఆదివారం మండల పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సరిపల్లి లయన్స్ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. ప్రజలకు చికిత్స అందించే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. రాష్ట్ర అధ్యక్షులు ఎన్.జయసూర్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు పిఎంపీలు అందించే సేవలు కీలకమన్నారు. జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె పరమేశ్వరరావు మాట్లాడుతూ 60 సంవత్సరాల ఆవిర్భవ దినోత్సవంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండలంలోని పిఎంపిలు పాల్గొన్నారు.

దుర్గాప్రశాంతికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

స్థానిక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎఎన్ఎం దుర్గాప్రశాంతి వైద్య ఖర్చులకు నల్లజర్ల మండలం చీపురుగూడేనికి చెందిన ప్రొఫెసర్ వసంతాడ ఆనంద్ స్వరూప్ రూ.పదివేలు ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడిగూడెం సచివాలయంలో ఎఎన్ఎంగా పనిచేస్తున్న దుర్గా ప్రశాంతి విధులకు వస్తుండగా లారీ ఢీకొన్న ఘటనలో రెండు కాళ్లనూ కోల్పోవడం


పూడిక తీస్తున్న కార్మికులు

ఎట్టకేలకు డ్రెయిన్ పూడికతీత పనులు

కలిదిండి:చినుకు పడితే చాలు ప్రధాన సెంటర్ నుండి కైకలూరు వెళ్లే రహదారి వెంబడి ఉన్న డ్రెయినేజీ నీటిపారుదల సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. సర్పంచి ఎం.మారుతీప్రసన్న చొరవతో డ్రెయినేజీ పూడిక పనులకు శ్రీకారం చుట్టారు. మెయిన్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం నుండి డ్రెయిన్‌కి కలిసే సీసీ డ్రెయిన్ పూడికను నాలుగు రోజులుగా ప్రత్యేక శానిటేషన్ సిబ్బందితో తొలగించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక శానిటేషన్ పనుల్లో భాగంగా డ్రెయినేజీ పూడిక పనులు పూర్తి చేసినట్లు సర్పంచి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అర్‌వి.ఉదయ్‌కుమార్, గొట్టుముక్కుల సత్యనారాయణరాజు, ఎం.వెంకటేశ్వరరావు, పాలకవర్గం సభ్యులు పనులు పర్యవేక్షించారు.

ప్రమాదకరంగా బోయగూడెం రోడ్డు

30 ఏళ్లుగా ఇదే దుస్థితి
కనీసం మరమ్మతులు కూడా చేయని వైనం
వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - చింతలపూడి

బోయగూడెం-వయా-నామవరం-సీతానగరం రోడ్డు గత 30 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో వాహనదారులు నానాఅవస్థలు పడుతున్నారు. కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని ప్రమాదకరంగా ఈ రోడ్డు తయారైంది. వర్షం పడితే పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి ఉంటుంది. గజానికో గొయ్యి ఏర్పడటంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఓటు అడగడానికి తప్ప మిగతా పరిస్థితుల్లో రాని పాలకులు ఈ రోడ్డు దుస్థితిని పట్టించుకోవాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు. చింతలపూడి మండలంలో బోయగూడెం-శెట్టివారిగూడెం వయా నామవరం రోడ్డు సీతానగరం మొత్తం నాలుగు పంచాయతీలో ఉన్నాయి. ఎనిమిది వేలమంది జనాభా ఉంది. బోయగూడెం, లక్ష్మీ నరసింహపురం, శెట్టివారిగూడెం, సుబ్బారాయుడుగూడెం, నామవరం, వెంకటపురం, పట్టాయిగూడెం, సీతనగరం గ్రామాలున్నాయి. ఆర్‌టిసి బస్సు సౌకర్యం నిలిపివేసి సుమారు తొమ్మిదేళ్లవుతుంది. గుంతలలో ఆటో ప్రయాణం నరకంగా మారి, విద్యార్థులు, మహిళలు సైతం నరకం అనుభవిస్తున్నారు.


అధ్వానంగా ఉన్న రోడ్డు

ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలి

సాధనసమితి ఆధ్వర్యంలో సంఘీభావ కార్యక్రమం

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రత్యేక హోదా సాధనసమితి ఆధ్వర్యంలో సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పల్లెం కిషోర్, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ప్రత్యేక హోదా సాధన సమితి జిల్లా కో-కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసం ప్రత్యేక హోదా సాధిస్తామని, విభజన హామీలను కేంద్రం మెడలు వంచి అమలు చేస్తామని ఎన్నికల సమయంలో విస్తృతంగా ప్రచారం చేసి అధికారం వచ్చిన తర్వాత కేంద్రం చెప్పినట్లు చేస్తుందని, రాష్ట్ర ప్రయోజనాలపై పెదవి విప్పడం లేదని విమర్శించారు. రాజ్యాంగంలో పొందుపరిచినట్లుగా రాష్ట్రాల హక్కులను సాధించడంలో సిఎం జగన్ విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు, ప్రత్యేక హోదా సాధన సమితి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బిజెపి అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లయినా రాష్ట్ర అభివృద్ధి గురించి కానీ, రాష్ట్ర ప్రయోజనాల గురించి గానీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాజ్యాంగ దినోత్సవం రోజు రాజ్యాంగ హక్కుల్ని కాలరాస్తున్న బిజెపికి వ్యతిరేకంగా, రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇచ్చిన హామీలను ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించుకునేందుకు రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఉద్యమించాలని, లేని పక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, వైఎస్ కనకారావు, పి.రవికుమార్, జి.ఏసుబాబు, జి.కోటేశ్వరరావు, సిహెచ్.పైడయ్య, యార్లగడ్డ సీతారాం, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, పుప్పాల కన్నబాబు పోలా భాస్కరరావు, శాయన అభిలాష్, ఎంఎం హకీమ్, మావూరి విజయ, తెర్లాపు శ్రీను, కురెళ్ల వరప్రసాద్, గనిశెట్టి ఈశ్వరరావు, పెరుపోగు యశ్వంత్, యుద్ధం శివ, జనపాల పోతురాజు, సిద్దల సాయి, దమ్ము నూకరాజు, బళ్ల కనకదుర్గారావు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.




సంఘీభావం కార్యక్రమంలో నేతలు

రాయల్ క్లబ్ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి రాయల్ క్లబ్ ద్వారా అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హైకోర్టు న్యాయవాది సింగలూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బైరా పట్నంలోని శుభం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కైకలూరు నియోజకవర్గంలో రాయల్ క్లబ్‌ను నెలకొల్పి ఎన్నోసేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా పేద విద్యార్థులను గుర్తించి వారికి విద్యలో ఎలాంటి ఆటంకం కలగకుండా వారికి ఆర్థిక ప్రోత్సాహకాలను అందించడం మరింత సంతోషదాయకమన్నారు. 2022-23 విద్యాసంవత్సరానికి ప్రతిభ కలిగిన పదిమంది విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో రూ.81 వేల ఉపకారవేతనాల చెక్కులను రాయల్ క్లబ్ ద్వారా అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కైకలూరు రాయల్ క్లబ్ అధ్యక్షులు సుధాకర్ విజయ్‌కుమార్, క్లబ్ అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ సుంకర కృష్ణ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఉదయభాస్కర్, వ్యాపారవేత్త కె.చంద్రరావు, కైకలూరు క్లబ్ మెంబర్షిప్ ఛైర్మన్ అద్దంకి వెంకట శ్రీనివాసరావు, సెక్రటరీ రామిశెట్టి విజయకుమార్ పాల్గొన్నారు.


విద్యార్థికి ప్రోత్సాహం అందిస్తున్న ప్రతినిధులు

అభివృద్ధి పథంలో చేవూరు

సొంత నిధులతో పలు కార్యక్రమాలు - సర్పంచి వల్లభనేని లక్ష్మి

ప్రజాశక్తి - ముదినేపల్లి


సర్పంచి లక్ష్మి

చేవూరు గ్రామ పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని సర్పంచి వల్లభనేని లక్ష్మి అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటార్వ్యూలో సర్పంచి మాట్లాడుతూ గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. గ్రామంలోని అధ్వానంగా ఉన్న స్కూల్ బజారును పంచాయతీ నిధులతో అభివృద్ధి చేశామని తెలిపారు. గతంలో తాగునీటి చెరువు కలుషితం కావడంతో ఉప్పు నీరు ప్రజలు తాగేవారన్నారు. గ్రామంలో ఆక్వా సాగు కారణంగా చెరువులోని నీరు ఉప్పుగా మారాయన్నారు. ప్రస్తుతం చెరువులో ఉన్న నాచు, తూడు తొలగించి 15 రోజుల పాటు చెరువులోని నీటిని బయటకు, లోపలకు నడిపి చెరువులో ఉన్న ఉప్పుదనం పోగొట్టి తాగునీరుగా మార్పు చేశామన్నారు. ప్రస్తుతం చెరువులోని నీరు ప్రజలు తాగేందుకు ఉపయోగకరంగా ఉందన్నారు. చినగొన్నూరు వద్ద ఉన్న సిబి కెనాల్ నుంచి చేవూరు తాగునీటి చెరువు వరకూ రెండు కిలోమీటర్ల పొడవున ప్రత్యేకంగా పైపులైన్ నిర్మాణానికి, తాగునీటి పథకం ఫిల్టర్ బెడ్స్ నిర్మాణానికి జలజీవన్ పథకం ద్వారా రూ.36 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. త్వరలో వీటి పనులు చేపడతామన్నారు. తాగునీటిచెరువును పూర్తిగా శుభ్రం చేసి చెరువు గట్లను పతిష్టం చేసి గట్ల చుట్టూ ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు తొలగించామన్నారు. గూడెం సమీపంలో ఉన్న శ్మశాన వాటికలో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల కంచెలను తొలగించామన్నారు. గతంలో గ్రామ పంచాయతీ భవనంలో ప్రజలకు సరైన సౌకర్యాలు లేవన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజల సౌకర్యార్థం భవనానికి ప్రహరి నిర్మాణం, రంగులు, మరుగుదొడ్ల సౌకర్యం, ఇతర వసతులను పంచాయతీ నిధులతో సమాకూర్చినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి జరగాలనే ఉద్దేశంతో సర్పంచి ఎన్నికల్లో పోటీ లేకుండా, అనవసర ఖర్చులు ఎందుకు, ఏకగ్రీవం చేస్తే గ్రామాన్ని పార్టీలకు అతీతంగా మరింత అభివృద్ధి దిశగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఏకగ్రీవం చేయాలనే దృఢ నిశ్చయంతో సర్పంచిగా పని చేసేందుకు తనకు అవకాశం కల్పించారన్నారు. గ్రామ పెద్దలు పదవిని ఏకగ్రీవంగా ఇచ్చిన కారణంగా గ్రామాభివృద్ధికి తన సొంత నిధులు రూ.17 లక్షలు వెచ్చించి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటానన్నారు. రూ.ఏడు లక్షలు ఖర్చు చేసి దళితవాడల్లో చర్చిల పున:నిర్మాణానికి సాయం చేసినట్లు తెలిపారు. దళితవాడలోని ఆర్‌సిఎం చర్చి మరమ్మతు పనులకు రూ.రెండు లక్షలు, సిఎస్ఐ చర్చి పున:నిర్మాణానికి రూ.రెండు లక్షలు, గూడెంలో సిఎస్ఐ చర్చి పున:నిర్మాణానికి రూ.మూడు లక్షలు మొత్తం రూ.ఏడు లక్షలు చర్చిల నిర్మాణాలకు సొంత నిధులు ఇచ్చినట్లు చెప్పారు. గూడెంలోని సిఎస్ఐ చర్చి శంఖుస్థాపనకు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావుతో పాటు తాము హాజరైనట్లు చెప్పారు. అదేవిధంగా దళితవాడలోని రెండు చర్చిల శంఖుస్థాపన కార్యక్రమాలకు తాము హాజరయ్యామన్నారు. గతంలో గ్రామంలో అసంపూర్తిగా ఉన్న రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ నిధులతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిధులు చాలకపోతే తన సొంత నిధులు వెచ్చించి క్లినిక్ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం పంచాయతీకి ఎదురుగా ఉన్న స్థలంలో సొంత నిధులతో కమ్యూనిటీ హాలు నిర్మిస్తామన్నారు. తాగునీటిచెరువు గట్టున ఉన్న గంగానమ్మ గుడికి గతంలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో పంచాయతీ నిధులు రూ.లక్షా15వేలు వెచ్చించి విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు గూడెంలోని అంగన్‌వాడీ కేంద్రం బజారు, స్కూల్ బజార్‌కు రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.ఎనిమిది లక్షల నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ రూ.పది లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో గూడెంలో పక్కా సీసీ డ్రెయినేజీల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.


చెరువు పూడిక తీత పనులు



అభివృద్ధిచేసిన అంగన్‌వాడీ కేంద్రం

వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు గ్రామానికి చెందిన లాయర్ వల్లభనేని రామారావు కుమార్తె డాక్టర్ అమరేశ్వరి తన సొంత నిధులు రూ.70 వేలు వెచ్చించి మోటర్ , పైపులు అందించారన్నారు. దీంతో గ్రామస్తులకు ఎటువంటి నీటి కొరత లేకుండా రెండు పూటలు స్వచ్ఛమైన తాగునీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజాలందరూ మెచ్చుకునే రీతిలో కులమతాలకు, పార్టీలకు అతీతంగా పరిపాలన సాగిస్తానన్నారు. గ్రామంలోని ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి పంచాయతీలకు వచ్చే నిధులు లభ్యతను బట్టి, ఎంఎల్ఎ సహాయ సహకారంతో చేవూరు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తన వంతు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. చేవూరు గ్రామాభివృద్ధికి సహాయ సహకారం అందిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్‌కు ఈ సందర్భంగా సర్పంచి కృతజ్ఞతలు తెలిపారు.


కృష్ణ సంస్మరణ సభలో అభిమానులు

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నటుడు కృష్ణ

ప్రజాశక్తి - కలిదిండి

సినీ నటుడు కృష్ణ భౌతికంగా మన మధ్య లేనప్పటికీ అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని సర్పంచి మహాదేవ విజయబాబు అన్నారు. మండలంలోని మూలలంక పంచాయతీ కార్యాలయం వద్ద కృష్ణ సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణ నటించిన చిత్రాలు వినోదం కోసమే కాక అణగారిన ప్రజల జనోద్ధరణకు సాంఘిక సంస్కరణలకు శ్రీకారం చుట్టాయని అభిమాన సంఘ నాయకులు కొనియాడారు. సుమారు రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అభిమాన సంఘ నాయకులు బొళ్ల ఏడుకొండలు, ఎడ్ల కృష్ణ, సిరిపురపు సత్యన్నారాయణ, శ్రీనివాస్, మామిడిశెట్టి నారాయణ, కుడిపూడి బ్రహ్మం, ముద్దం బుల్లి వెంకయ్య, ఎంపిటిసి రావాడి బాలు, అభిమానులు పాల్గొన్నారు.

30న చంద్రబాబు పర్యటను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 30వ తేదీన మాజీ సిఎం చంద్రబాబు పర్యటను విజయవంతం చేయాలని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు పిలుపునిచ్చారు. చింతలపూడి పట్టణంలో రోడ్ షో ప్రాంతాలను, ఎంఎల్‌సి మంతెన సత్యనారాయణరాజు, నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ ఎన్నికల ముందు చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని, రైతులను ఆదుకుంటామని చెప్పిని సిఎం జగన్ ఇప్పటివరకూ ఆ ప్రాజెక్టు ఊసే ఎత్తలేదన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేస్తామని చెప్పి సమీక్షలతో సరిపెడుతున్నారన్నారు. 30వ తేదీ సాయంత్రం చింతలపూడికి చేరుకుంటారని, అనంతరం జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరామయ్య, కోండ్రు దేవా పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : 30వ తేదీన చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలని ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చింతల వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో పార్టీ మండల ఉపాధ్యక్షులు నిమ్మగడ్డ రవీంద్ర అధ్యక్షత ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు యాళ్ల సుజీవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించాలన్నారు. పోలవరం నియోజకవర్గంలో పర్యటనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పారేపల్లి రామారావు, పట్టణ అధ్యక్షుడు జేష్ఠ రామకృష్ణ, మేకల నాగేంద్రప్రసాద్, బొమ్మ గంటలయ్య, ఆకుల అరుణ, పెండ్యాల రమాదేవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.